క్లుప్తంగా

ఒత్తిడి లేని విద్యనందించాలి



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష జిల్లా చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారిణి మేరి

సిద్దవటం : విద్యార్థులను ఇబ్బంది పెట్టకుండా ఒత్తిడి లేని విద్యనందించాలని సమగ్ర శిక్ష జిల్లా చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారిణి మేరి సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా సిద్దవటం మండలంలోని 11వ బెటాలియన్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేరీ మాట్లాడుతూ విద్యార్థులకు మానసిక ప్రశాంతత భావోద్వేగ సమతుల్యత ఒత్తిడి నియంత్రణ పద్ధతులపై మార్గదర్శకాలు ఇచ్చారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా ఉత్సాహంగా ఆహ్లాదమైన ప్రదేశంలో విద్యను అభ్యసించే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య, హెడ్మాస్టర్ సమీర్ బాషా, ఉపాధ్యాయులు సిరాజుల్లా, రవిశంకర్, మహబూబ్‌బాషా, చంద్రశేఖర్, మౌలాలి విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడలు కూడా ముఖ్యమే

వీరబల్లి: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమని ఎంఈఓ కృష్ణయ్య అన్నారు. గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన మండలస్థాయి ఆటపోటీల్లో మండలంలోని పెద్దివీడు, మట్లి, ఓదివీడు, సానిపాయి, సమర్థివాండ్లపల్లి, ఉప్పరపల్లి, వీరబల్లి, గడికోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ వాలీబాల్, కబడ్డీ, చెస్, యోగా క్రీడలు నిర్వహించి ఎంపికైన విద్యార్థులు రాజంపేటలో డివిజన్ స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగదీశ్వరయ్య, మదన్ మోహన్ రెడ్డి, రవీంద్ర రాజు, శేఖర, చిట్టిబాబు, ఉమాదేవి, పార్వతి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన కువైట్ నేతలు



వైఎస్ జగన్‌తో కువైట్ కో–కన్వీనర్ రమణయాదవ్, గల్ఫ్ కో–కన్వీనర్ ఇలియాస్

రాజంపేట: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కువైట్ నేతలు కలిసినట్లు గల్ఫ్ కన్వీనరు ఇలియాస్ గురువారం తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గ్లోబల్ ఎన్‌ఆర్‌ఐ కన్వీనర్ సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో కువైట్ కో–కన్వీనర్ రమణయాదవ్, కువైట్ అడ్వైజర్ అబూతురాబ్, వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా కువైట్ కో–కన్వీనర్ రమణయాదవ్ మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి అందించని పథకాలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిచారని కొనియాడారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



రిపోర్టును పరిశీలిస్తున్న వైద్యులు

రాయచోటి అర్బన్ : రాయచోటి మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. రాయచోటి పట్టణానికి చెందిన రోటరీ క్లబర్ మనం సేవా సంఘం వారు తిరుపతిలోని సంకల్ప ఆసుపత్రి వారి సౌజన్యంతో ఈ వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యశిబిరంలో వివిధ జబ్బులతో బాధపడుతున్న 130 మందికి వైద్య సేవలు అందించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. వైద్య పరీక్షలతో పాటు చికిత్స చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్, మనం సేవా సంఘం సభ్యులు జోషి, షేక్ హుస్సేన్ , రాయల్, సురేష్, రూపేష్, ప్రకాష్, రాజు, శశి, కేవీఎస్ నాయుడు, శ్రీనివాసులు, భాస్కర్, శంకర్ పాల్గొన్నారు.

ఘన నివాళి



పిచ్చయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

పెనగలూరు: మండలంలోని సింగనమల గ్రామంలో గురువారం ముదిరాజ్ సంఘం రాష్ట్ర డైరెక్టర్ ఈశ్వరయ్య తండ్రి పిచ్చయ్య పెద్దకర్మ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పిచ్చయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బరాయుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నరసింహులు, శివకుమార్, సింగనమల శంకరయ్య, గుండ్లూరు శివకుమార్, మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం!



కొత్తపేట రామాపురం వీధిలోని డ్రైనేజీ కాలువ వద్ద పొంచి ఉన్న ప్రమాదం



రక్షణ గోడ లేకుండా ప్రమాదకరంగా డ్రైనేజీ కాలువ

ప్రమాదం.. పెళ్లో, పేరంటమో కాదు, ముందే చెప్పి రావడానికి.. ఏ మూల నుంచో, ఏ వైపు నుంచో, ఏ సెకనులోనూ రెప్పపాటున ఒక్కసారిగా విరుచుకుపడుతుంది. జీవితాన్ని చిన్నాభిన్నం చేస్తుంది. చిన్నపాటి వర్షానికే పట్టణంలో పలు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. మున్సిపల్ అధికారులు అప్రమత్తమై ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

- వర్షం కురిస్తే పొంగుతున్న కాలువలు
- రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు
- ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తప్పనిసరి

రాయచోటి అర్బన్ : రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని పలుచోట్ల డ్రైనేజీ కాలువల వద్ద ప్రమాదాలు పొంచి ఉన్నాయి. మురుగునీరు, వర్షపు నీటిని సరిపడా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పురవాసులు కోరుతున్నారు. రాయచోటి మున్సిపాలిటీలోని లోతట్టు ప్రాంతాలైన కొత్తపేట రామాపురం వీధులు, పాత రాయచోటిలోని పలు వీధులతో పాటు, కొత్తపల్లె ప్రాంతం, మహబూబ్‌నగర్ వీధుల్లోని మోస్తరు వర్షాలకే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఘోర ప్రమాదం నేర్పిన గుణపాఠం

సెప్టెంబర్ 19వ తేదీన సాయంత్రం కురిసిన ఓ మోస్తారు వర్షానికి రాయచోటి పట్టణంలోని పలు వీధుల్లో ఊహించని విధంగా డ్రైనేజీ కాలువలు పొంగిపొర్లాయి. కొత్తపేట రామాపురం వీధిలో 7 ఏళ్ల చిన్నారి డ్రైనేజీలో పడి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందింది. అలాగే ఎస్ఎన్ కాలనీలో డ్రైనేజీలో పడి తల్లీకొడుకు కొట్టుకుపోగా, వారిని కాపాడబోయి ఓ వ్యక్తి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందారు. ప్రమాదం జరిగిన తర్వాత మున్సిపల్ అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రమాదాలు జరిగిన ప్రదేశాల్లో మరమ్మతులు చేస్తున్నారు. అయితే మిగిలిన పట్టణంలోని చాలా చోట్ల డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, ఉన్న డ్రైనేజీ కాలువల వద్ద రక్షణ వ్యవస్థ లేకపోవడం పట్టణవాసులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. పట్టణంలోని కొత్తపేటలోని వీఆర్ స్కూల్ సమీపంలోని డ్రైనేజీ, డైట్ హాస్టల్ వద్ద, పాత రాయచోటిలోని వీధులు, ఎస్ఎన్ కాలనీలోని గవర్నర్ కల్యాణ మండపం వీధి, కొత్తపల్లెలోని పలు లోతట్టు ప్రాంతాలు, మహబూబ్‌నగర్ వీధుల్లో డ్రైనేజీల వద్ద ప్రమాదాలు పొంచి ఉన్నాయి. అటువంటి వాటిని గుర్తించి ముందస్తు చర్యలు తీసుకొని, రక్షణ గోడలను కూడా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిధుల కోసం ఎంపీటీసీల రగడ

సర్వసభ్య సమావేశం మధ్యలోనే లేచి వెళ్లిన ఎంపీటీసీలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి

సుండుపల్లె : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జరిగే మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు వ్యక్తిగత ప్రయోజనాల కోసం గొడవకు దిగడంతో సభ అర్ధాంతరంగా ఆగిపోయింది. మొదట ఎంపీపీ రాజమ్మ అధ్యక్షతన సమావేశం ప్రారంభమైంది. పంచాయతీరాజ్ ఏఈ, వ్యవసాయ శాఖ ఏఓ, ఉద్యానవన శాఖ అధికారి ప్రసంగించిన అనంతరం మండల వైస్ ఎంపీపీ కదిరిచేని రెడ్డమ్మ మాట్లాడుతూ రెజల్యూషన్‌లో ఎంపీటీసీల సంతకం లేకుండా మండల అభివృద్ధి నిధులను పంచాయతీలకు కేటాయిస్తున్నారని ప్రశ్నించారు. ఎంపీటీసీలకు ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధికి పనులు అడిగితే నిధులు లేవని చెబుతున్నారని ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే రాయవరం సచివాలయం ప్రహరీ నిర్మాణానికి రూ.8 లక్షల నిధులను మండల గ్రాంట్ నుంచి ఎలా కేటాయించో సమాధానం చెప్పాలని పట్టుబడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మండల గ్రాంట్ నుంచి గ్రామాల అభివృద్ధికి ఎంపీటీసీలకు ఎటువంటి నిధులను ఇవ్వలేదని మండల గ్రాంట్‌కు వచ్చిన నిధులను ఎంపీటీసీలకు ఇవ్వకుండా వేరే వ్యక్తులకు ఇవ్వడం ఏమిటని వారు ప్రశ్నించారు. అనంతరం మండల రిజల్యూషన్ తీసుకొని అనుమతులు ఇచ్చానని, మీరు కూడా పనులు చేయండి చేసిన పనులు చూపించండి బిల్లులు పెడతామని ఎంపీడీఓ ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఎంపీటీసీలు సభాభవనం నుండి వెళ్లిపోయారు. అనంతరం ఎంపీపీ వారిని బుజ్జగించే ప్రయత్నాలు చేశారు. అధికారులు అందరూ వెళ్లిపోయిన తర్వాత తిరిగి ఎంపీటీసీలు సభాభవనానికి వచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సురేష్‌బాబు, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇర్ఫాన్ అహమ్మద్, ఏఓ మహమ్మద్‌బాషా, డిప్యూటీ రేంజర్ రమేష్‌బాబు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు

రాజంపేట: ఇటీవల ఆర్టీసీ అద్దెబస్సు డ్రైవర్‌పై ప్రయాణీకులు చేసిన దాడిని నిరసిస్తూ గురువారం రాజంపేట ఆర్టీసీ డిపో వద్ద అద్దెబస్సు డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. నిరసనకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ కార్మికనాయకులతో కలిసి మద్దతు తెలిపి నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అద్దె బస్సు డ్రైవర్‌పై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. శాశ్విత ప్రాతిపదకన పనిచేసే డ్రైవర్లుకు ఎలాంటి రక్షణ ఉంటుందో, యాజమాన్యం నుంచి తమకు కూడా అలాంటి రక్షణ ఉండాలని డిమాండ్ చేశారు. నిర్దేశించిన స్టాపింగ్ పాయింట్ల వద్ద మాత్రమే బస్సు నిలుపదల చేసేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు. 9 డిమాండ్లను ఈ నెల 20వ తేదిలోపు పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా అద్దె బస్సులను నిలిపివేస్తామని హెచ్చరించారు. నిరసనలో అద్దెబస్సు డ్రైవర్లతోపాటు సీఐటీయు నాయకులు పీవీ రమణ, ఎం.రమణ, లక్ష్మీదేవి, సిద్దయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లకు రక్షణ కల్పించాలి

రాయచోటి అర్బన్ : ఏపీఎస్‌ఆర్టీసీ సంస్థలో అద్దె బస్సులను నడుపుతున్న డ్రైవర్లకు రక్షణ కల్పించాలని సీఐటీయూ మండల కన్వీనర్ భాగ్యలక్ష్మి , కో కన్వీనర్ టీవీ రమణ డిమాండ్ చేశారు. గురువారం వారు స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మూడు చోట్ల డ్రైవర్లపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి డ్రైవర్లకు ఎటువంటి సౌకర్యాలు కల్పించకున్నా, వారు ప్రయాణికులను ప్రతి రోజు సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతున్నారని పేర్కొన్నారు. బస్సు ఆపకుంటే రవాణా శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలి తప్పా దాడికి పాల్పడడం చట్ట ప్రకారం నేరం అన్నారు. కార్యక్రమంలో మాధవయ్య, వెంకటేష్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్

రాయచోటి: వినియోగదారులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ సురేంధర్ నాయుడు పేర్కొన్నారు. గురువారం రాయచోటిలోని విద్యుత్ సర్కిల్ ఎస్ఈ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉపకేంద్రాలలో ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అలాగే కొత్తగా సర్వీసులు తీసుకున్న విద్యుత్ వినియోగదారులకు ఎస్ఓపీ నిబంధనల ప్రకారం సర్వీస్ కనెక్షన్లు మంజూరు చేయాలన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా ముందస్తు చర్యలు చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే త్వరితగతిన పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలన్నారు. అధికలోడు ఉన్న ప్రాంతాలలో అడిషనల్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి లోఓల్టేజీ సమస్య రాకుండా చూడాలన్నారు. విద్యుత్ ఉద్యోగులు ఓఅండ్‌ఎం సిబ్బంది వినియోగదారులకు అందుబాటులో ఉంటూ వారికి నాణ్యమైన విద్యుత్‌ను అందజేయాలన్నారు. సూపరింటెండెంట్ ఇంజనీర్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, అన్నమయ్య సర్కిల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్,అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్, అకౌంట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులతో ఎమ్మెల్యే ఆకేపాటి

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలోని రైల్వే కల్యాణ మండపంలో గురువారం ఉపాధ్యాయురాలు హేమలత కుమారుడు కార్తీక్ వివాహ వేడుకలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. గుండు మల్లికార్జునరెడ్డి, ఆకేపాటి జగదీశ్వర్‌రెడ్డి, నడివీధి సుధాకర్, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధోత్సవం



ప్రార్థన చేస్తున్న మేడా విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ జెండామానువీధిలో వెలసిన హజరత్ మహబూబ్‌సుభాని గంధం మహోత్సవం గురువారం రాత్రి అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల పరిషత్ అధ్యక్షులు మేడా విజయభాస్కర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనాబ్ ఎస్టీ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కలీముల్లాఖాన్, నందలూరు దర్గా గురువులయ్య హైదర్‌హుస్సేన్, జిల్లా మాజీ వక్ఫ్ బోర్డు కార్యదర్శి సయ్యద్ అమీర్, న్యాయవాది షమీవుల్లాఖాన్, సయ్యద్ జుల్ఫికర్, బూసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, తుమ్మల శ్రీధర్‌గౌడ్, విజయుడు, బద్రిరెడ్డి, దర్గా కమిటీ సభ్యులు మౌలా, సమీర్, షఫీ, అన్వర్, అల్తాఫ్, మహమ్మద్ పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఓబులవారిపల్లె: మండలంలోని చిన్నఓరంపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు. 19808/3లో భూ కబ్జాలను అరికట్టాలని గురువారం డిప్యూటీ తహసీల్దార్ సిద్దేశ్వరరావుకు సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంబంధిత సర్వే నంబర్లలో పది ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, టీడీపీ నాయకుడు కబ్జాలకు పాల్పడి కోట్లాది రూపాయలకు విక్రయించారని ఆరోపించారు. ఆయనకు రాజకీయ అండ ఉండటంతో రెవెన్యూ అధికారులు అడ్డుకోలేక పోతున్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వ భూమిని కబ్జాకు గురికాకుండా చూడాలని కోరారు. బీకేఎంయూ జిల్లా అధ్యక్షులు పండుగోల మణి, నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, వ్యవసాయ మండల కార్యదర్శి చింతల పూడి నాగమ్మ, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో అందుబాటులో వైద్య సేవలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య



జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

నందలూరు : జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల పేదలకు వైద్య సేవలు మరింత చేరువ అవుతాయని ఎంఎల్‌హెచ్‌పీలు సులోచన, మల్లీశ్వరి, హిమబిందుపేర్కొన్నారు. నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లిలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద గురువారం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు తక్కువ జీఎస్టీతో లభించే ఆరోగ్య ఉత్పత్తులు, మందులు, జీవితబీమాపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. జీఎస్టీ సంస్కరణ వల్ల దీర్ఘకాలిక వ్యాధులకు ఉపయోగించే వివిధ రకాల మందులు, వ్యాధి నిర్ధారణ కిట్లు, దృష్టిని సరిచేసే కళ్ల అద్దాలపై 12 శాతం నుంచి 5 శాతానికి జీఎస్టీని తగ్గించారన్నారు. మందుల షాపుల్లో ఎవరైనా అధిక జీఎస్టీని వసూలు చేస్తే అధికారులకు తెలియజేయాలన్నారు. తీవ్ర అనారోగ్యానికి సంబంధించిన మందులపై జీఎస్టీ చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణరక్షక మందులపై పన్ను రద్దు

రాయచోటి టౌన్ : భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణల వలన ప్రజలకు అందుబాటు ధరల్లో మందులు లభిస్తాయని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసయ్య సూచించారు. సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్ కార్యక్రమంలో భాగంగా గురువారం దేవపట్ల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రకృతి ఆధ్వర్యంలో వైద్య సిబ్బందికి, స్థానికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఉపయోగించే మందులు నూతనంగా ప్రవేశపెట్టిన జీఎస్టీ ద్వారా తక్కువ ధరలకే లభిస్తున్నాయనే విషయం ప్రజలకు తెలియచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వెంకటేష్, ఎంపీహెచ్‌ఎస్ వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్ సేవింగ్స్‌తో ప్రజలకెంతో మేలు

గాలివీడు : సూపర్ జీఎస్టీ అమలుతో ప్రజలకెంతో మేలు చేకూరుతోందని ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్ అన్నారు. గురువారం మండలంలోని నూలివీడు గ్రామ పంచాయతీ పరిధిలో మెడికల్, ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ వలన వైద్య పరికరాలు, మందులపై జీఎస్టీ రేట్లు బాగా తగ్గాయని, ఆరోగ్య బీమాకి కూడా జీఎస్టీ వలన ఆదా కలిగిందని, ప్రాణాంతక వ్యాధులకు సంబంధించిన మందులపై జీఎస్టీ తగ్గించడం వలన మధ్యతరగతి కుటుంబాలకు, నిరుపేద కుటుంబాలకు ఎక్కువ ప్రయోజనం కలిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సంబేపల్లె : సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి లక్ష్మీనరసయ్య ఆదేశించారు. మండల పరిధిలోని దేవపట్ల, సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను గురువారం జిల్లా వైద్యాధికారి లక్ష్మీనరసయ్య సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంపై కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం ఆరోగ్య కేంద్రాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు.

జీఎస్టీపై అవగాహన కలిగి ఉండాలి

పుల్లంపేట: జీఎస్టీపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ జయశ్రీ అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రధానంగా వైద్య ఉత్పత్తులు, వైద్య పరికరాలు, మందులు తదితర వస్తువులకు సంబంధించి జీఎస్టీని తగ్గించిన విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. అనంతరం ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్ బాలికలు అప్రమత్తంగా ఉండాలి

కేవీపల్లె: మైనర్ బాలికలు తమను తాము కాపాడుకోవడానికి అప్రమత్తంగా ఉండాలని సీఐ ఆర్.లక్ష్మన్న పేర్కొన్నారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్ నందు మైనర్ బాలికల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు సమాజంలో ధైర్యంగా ఉండాలని, బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని సూచించారు. సమాజంలో జరిగే అకృత్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల పట్ల జాగ్రత్త వహించాలని పేర్కొన్నారు. ఆపద సమయంలో 112, 100, 1098 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం భారత్ స్కాట్స్ అండ్ గైడ్స్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రెడ్డి బాషా, ఎస్ఐ చిన్నరెడ్డెప్ప, ప్రిన్సిపాల్ శీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర కార్యక్రమాలు బహిష్కరణ



అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

పుల్లంపేట: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం పుల్లంపేట ఫ్యాప్టో నాయకులు బోధనకు ఆటంకం కలుగుతున్న అన్ని రకాల బోధనేతర కార్యక్రమాలను శుక్రవారం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో బహిష్కరిస్తున్నట్లు స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యాశక్తి, జీఎస్టీ 2.0, గూగుల్ సీట్లు నింపడం లాంటి బోధనేతర పనులు ఉపాధ్యాయులు చేయాలని చెప్పడం తగదన్నారు. మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వల్ల టీచర్ల బోధనా సమయం వృధా అవుతోందని, విద్యార్థులకు బోధన సమయం నష్టపోతున్నారని తెలిపారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు శుక్రవారం నుంచి బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివి రమణమూర్తి, సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, వల్లూరు సిద్దయ్య, ఎస్వి రమణ, ఫ్యాప్టో నాయకులు ఎం శివరాం, ప్రసాద్, మునగపాటి శ్రీను, మాధవ మూర్తి, ఎస్ఎండీ హుస్, నాగభూషణం, పెంచలయ్య, మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం



రాజంపేట: ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న మాజీమంత్రి పెద్దిరెడ్డి



రైల్వేకోడూరు: మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మేడా రఘునాథరెడ్డితో నాయకులు



పుల్లంపేట: కార్యకర్తను సన్మానిస్తున్న మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



ఓబులవారిపల్లె: వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుల్లంపేట: ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భరోసా ఇచ్చారు. గురువారం రాజంపేటలోని ఆకేపాటి ఎస్టేట్‌లో కార్యకర్తల సమావేశం ముగించుకొని వెళ్తుండగా స్థానిక బైపాస్‌లోని రామాలయం వద్ద వైఎస్సార్ పార్టీ కార్యకర్తలు, మండల పరిషత్ అధ్యక్షులు ముద్దా బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన నడుస్తుందని, అధికారం శాశ్వతం కాదని ఈ విషయాన్ని టీడీపీ నాయకులు గుర్తించాలన్నారు. ప్రతి కార్యకర్త తాము ఎదుర్కొంటున్న సమస్యలను డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే డిజిటల్ బుక్‌లో నమోదైన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ఆయనను శాలువాలతో సత్కరించగా తిరిగి ఆయన స్థానిక సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, క్రియాశీలక కార్యకర్తలు రాంబాబును సత్కరించారు. ఈ కార్యక్రమంలో రైల్వే బోర్డు మెంబర్ భరత్‌కుమార్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రంగారెడ్డి, హరి తదితరులు పాల్గొన్నారు.

'పెద్దిరెడ్డి'కి ఘనస్వాగతం

రాజంపేట: మేడాభవన్‌కు గురువారం చేరుకున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, శాసనసభ్యుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఘనస్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఎంపీ మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భేటి అయ్యారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దిరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనువాసులు, రాజంపేట మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనువాసులరెడ్డి, నందలూరు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పీసీ యోగీశ్వరరెడ్డి, ఏఐటీఎస్ వైస్ చైర్మన్ బొప్పా ఎల్లారెడ్డి, ఒంటిమిట్ట మండల కన్వీనర్ టక్కోలు శివారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు తుమ్మల భావన శ్రీధర్, నందలూరు కో–ఆప్షన్ సభ్యుడు కలీం, వైఎస్సార్‌సీపీ నేతలు పొత్తపి చంద్ర, పాలగిరి సుధాకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఆల్విన్, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రామాపురం: వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం రాజంపేట ఆకేపాడు ఎస్టేట్‌లో గురువారం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాయచోటి మాజీ శాసనసభ్యులు గడికోట శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి సూరం వెంకటసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ మాసన వెంకటరమణ, గాలివీటి ప్రవీణ్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సగినాల శివశంకర్, మార్పూరి ఆదిరెడ్డి, దువ్వూరి ఆంజనేయులు పాల్గొన్నారు.

జగనన్న ఆదేశాలను శిరసావహిస్తాం

రైల్వేకోడూరు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలను శిరసావహిస్తామని రైల్వేకోడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. రాజంపేట మండలంలో ఆకేపాటి ఎస్టేట్‌లో గురువారం ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి మాజీ మంత్రి, పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రైల్వేకోడూరు మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు, రాయచోటి మాజీ శాసనసభ్యులు గడికోట శ్రీకాంత్ రెడ్డి, అన్నమయ్య జిల్లా పరిశీలకులు సురేష్ బాబు, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజంపేట ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు తమ శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించి కూటమి ప్రభుత్వ అరాచకాలు అరికడతామన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట మండల కన్వీనర్ సయ్యద్ ముస్తాక్, జెడ్పీటీసీ రామనాథం, కుమార్ రెడ్డి, పంజం భరత్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మంగంపేట జాతీయ రహదారి వద్ద రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు నాయకులతో కలిసి ఘనంగా స్వాగతం పలికారు. గురువారం రాజంపేట పట్టణంలో నిర్వహిస్తున్న పార్టీ సమావేశానికి వారు వెళ్తుండగా మంగంపేట వద్ద నాయకులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బొమ్మవరం సర్పంచ్ లౌడి గంగురాజు, రాయలసీమ జోనల్ బూత్ కమిటీ అధ్యక్షులు తల్లెం భరత్ కుమార్ రాజు, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.